www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
సోమవారం | 09 | మార్చి | 2026 | పేజీలు: 08

# రూ. 338 కోట్ల ఆర్అండ్ఆర్ ప్యాకేజ్

**ఉదండాపూర్ నిర్వాసితులకు పరిహారం**

**పెంచిన మొత్తాలతో చెల్లింపునకు ప్రభుత్వం అంగీకారం**

**2 నెలల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చిన మంత్రి ఉత్తమ్**

**మల్లన్నసాగర్ తరహాలోనే ఉదండాపూర్**

**ప్లాట్లు కూడా రిజిస్టర్ చేసి ఇవ్వాలన్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**



**జడ్చర్ల, అక్షిత న్యూస్ :** ఉదండాపూర్ ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ కింద పెంచిన మొత్తాలతో కలిపి రూ. 338 కోట్లను చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించిందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. ఈ మొత్తాన్ని రెండు నెలల్లో నిర్వాసితులకు అందజేస్తామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ కూడా ఇచ్చారని ఆయన వెల్లడించారు. దీనితో పాటుగా మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఇచ్చిన తరహాలోనే ఉదండాపూర్ నిర్వాసితులకు కూడా ప్లాట్లు రిజిస్టర్ చేసి ఇవ్వాలని కోరామని చెప్పారు. హైదరాబాద్ లోని జలసౌధ లో ఆదివారం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పై జరిగిన అధికారిక సమీక్షా సమావేశం లో ఈ విషయాలపై చర్చించడం జరిగిందని అనిరుధ్ రెడ్డి వివరించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ లో భాగంగా ఉదండాపూర్ నిర్వాసితులకు ఇచ్చే పరిహారాన్ని రూ.18 లక్షలకు పెంచడం, ఈ కారణంగా నిర్వాసితులకు అదనంగా రూ.146 కోట్ల రూపాయల మొత్తాన్ని చెల్లించడానికి ప్రభుత్వం గతంలోనే అంగీకరించిందని గుర్తు చేశారు. పెంచిన పరిహారంతో కలిసి ప్రస్తుతం ఉదండాపూర్ నిర్వాసితులకు ఇంకా రూ.338 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఈ మొత్తాన్ని రెండు నెలల్లో నిర్వాసితులకు అందజేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే గతం మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ నిర్వాసితులకు జివో నంబర్.1 ద్వారా వారికి కేటాయించిన ప్లాట్లను రిజిస్టర్ చేసి ఇవ్వడం జరిగిందని అదే విధంగా ఉదండాపూర్ నిర్వాసితులకు ఇస్తున్న ప్లాట్లను కూడా రిజిస్టర్ చేసి ఇవ్వాలని కోరామని తెలిపారు. ఈ విషయం గురించి ఇదివరకే జిల్లా కలెక్టర్ తో కూడా మాట్లాడానని అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. గత ..మిగతా 2లో



## రికార్డులు తారుమారు

# పక్కాగా రిజిస్ట్రేషన్ !

**వక్ఫ్ బోర్డు ల్యాండ్ కు ఎసరు ?**

**నకిలీ పత్రాలతో కోట్ల విలువైన వక్ఫ్ బోర్డు భూమి, అన్యాక్రాంతం అయినట్లేనా..?**

**కోర్టును పక్కదారి పట్టించి ప్రైవేట్ ల్యాండ్‌గా రిజిస్ట్రేషన్**

**1989 రికార్డుల ప్రకారం వక్ఫ్ బోర్డు ల్యాండ్**

**ప్రస్తుత రెవెన్యూ రికార్ధుల్లో సర్కారు భూమి,చెరువు భూమిగా చూపుతున్న వైనం**

**సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్న వక్ఫ్ బోర్డ్, రెవెన్యూ అధికారులు**

**విలువైన వక్ బోర్డు ల్యాండ్ ప్రైవేట్ వ్యక్తుల వశం**






**మేడ్చల్, అక్షిత బ్యూరో :** రికార్డులు తారుమారు చేసి పక్కా ప్రణాళికతో పక్కా రిజిస్ట్రేషన్ చేయించుకొని కోర్టును బురిడి కొట్టించిన ఘనులు.తప్పుడు పత్రాలు సృష్టించి వక్ఫ్భూములను కాజేసేందుకు కుట్ర పన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తలచుకుంటే కబ్జాకు కాదేది కనర్హం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నుంచి రియల్ స్టేట్ ..మిగతా 2లో

## పల్లె ప్రకృతితో

# ఆహ్లాదం ఆనందం

**పరిశుభ్రంగా ఉంచాలి: కలెక్టర్ చంద్ర శేఖర్**



**నల్గొండ టౌన్, అక్షిత న్యూస్ :** పల్లె ప్రకృతి వనాలు శుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండే విధంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్ అన్నారు. ఆదివారం ఆయన నల్లగొండ మండలం, చందనపల్లి గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డులను సందర్శించారు. పల్లె ప్రకృతి వనంలో మంచి పూల మొక్కలు, నీడనిచ్చే చెట్లు ఇతర ఉపయోగకరమైన మొక్కలను పెంచాలని సూచించారు.గ్రామ ప్రజలు, పిల్లలు విశ్రాంతి తీసుకునేలా ప్రకృతి వనాన్ని అందంగా తీర్చిదిద్దాలన్నారు. అలాగే గ్రామంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌ను ..మిగతా 2లో

## హెచ్‌పివి వ్యాక్సిన్‌తో

# సర్వైకల్ క్యాన్సర్‌కు చెక్

**జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య**



**సంగారెడ్డి, అక్షిత బ్యూరో :** ప్రపంచ వ్యాప్తంగా మహిళల్లో పెద్ద ఆరోగ్య సమస్యగా ఉన్న సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్‌పివి వ్యాక్సిన్ ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. ఆదివారం సంగారెడ్డి జనరల్ ఆసుపత్రి లో హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 15 సంవత్సరాల లోపు బాలికలకు జనరల్ ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రుల్లో హెచ్‌పివి వ్యాక్సిన్‌ను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 14 నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల సుమారు 12,500 మంది బాలికలను వైద్య ..మిగతా 2లో

## రూ. 338 కోట్ల ఆర్అండ్ఆర్ ప్యాకేజ్

**మొదటి పేజీ తరువాయి...**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉదండాపూర్ నిర్వాసితులకు న్యాయం చేయకపోగా భూములు లేని వారికి కూడా దొంగ డాక్యుమెంట్లు సృష్టించి పరిహారాలు ఇచ్చారని చెప్పారు. లేని వారికి కూడా ఇళ్లు ఉన్నాయని రికార్డులు క్రియేట్ చేసి వారికి కూడా పరిహారం చెల్లించాలని జాబితాలు తయారు చేశారని విమర్శించారు. ప్రస్తుతం తాము రీ సర్వే చేయించి అర్హులను గుర్తించడం జరిగిందని అన్నారు. అలాగే భూములు లేకుండానే దొంగ డాక్యుమెంట్లు సృష్టించి పరిహారాలు కొట్టేసిన వారి నుంచి రికవరికి ఆర్ ఆర్ చట్టం కింద నోటీసులు కూడా జారీ చేయించడం జరిగిందని, ఇళ్లు లేకుండానే జాబితాలో ఉన్న అనర్హుల పేర్లను తొలగించడం కూడా జరిగిందని అనిరుధ్ రెడ్డి వివరించారు. ఉదండాపూర్ నిర్వాసితులలో కొంత మంది కోర్టుకు వెళ్ళడం జరిగిందని వారితో కూడా మాట్లాడి వారికి రావాల్సిన పరిహారాన్ని కూడా అందరితో పాటు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని అనిరుధ్ రెడ్డి కోరారు. ఉదండాపూర్ ప్రాజెక్ట్ పనులను కూడా త్వరిత గతిన పూర్తి చేయడానికి కూడా చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. ఉదండాపూర్ నిర్వాసితుల విషయంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి లేవనెత్తిన అంశాలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.

## పల్లె ప్రకృతితో ఆహ్లాదం ఆనందం



**మొదటి పేజీ తరువాయి...**

సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా డంపింగ్ యార్డ్‌లోనే వేయాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు కలిసి పనిచేయాలని కలెక్టర్ తెలిపారు.పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే గ్రామాలు మరింత అందంగా మారుతాయని అన్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్, కార్యదర్శి తదితరులు ఉన్నారు.

## హెచ్‌పివి వ్యాక్సిన్‌తో సర్వైకల్ క్యాన్సర్‌కు చెక్




**మొదటి పేజీ తరువాయి...**

ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించినట్లు తెలిపారు. ఈ బాలికలందరికి ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక, 99 రోజుల కార్యక్రమం కాలంలో ఉచితంగా వ్యాక్సినేషన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బాలికల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రుల సమక్షంలోనే ఈ వ్యాక్సిన్ అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణం కోసం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేపడుతున్న ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.వసంతరావు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రికార్డులు తారుమారు పక్కాగా రిజిస్ట్రేషన్ !

**మొదటి పేజీ తరువాయి...**






రంగం పుంజుకోవడంతో శివారు గ్రామాల మధ్య భూముల ధరలు రెక్కలు రావడంతో వక్ఫ్ బోర్డు భూములు అయినా చెరువులు కుంటలు ఎఫ్ టిఎల్ లో బఫర్ జూన్ లలో నాలాలకు ఏకంగా కబ్జాలకు తెరలేపుతున్నారు. వక్ బోర్డు భూములైనా, దేవాదాయ భూములైనా వారి తదనంతరం వారి కుటుంబ సభ్యులు వ్యవసాయం చేసుకొని అనుభవించాల్సి ఉంటుంది. కొందరు ముస్లింలు సదరు భూములను విద్యాభివృద్ధికి, సమాజసేవకు, ప్రజాపయోజనాలా కోసం ప్రభుత్వానికి అందజేస్తూ వారి ఉదారతను చాటుకుంటుండగా నిబంధనలకు విరుద్ధంగా కొందరు వ్యక్తులు వక్ఫ్ భూములను అడ్డదారిలో అమ్మేస్తూ సొమ్ము చేసు కుంటున్న సంఘటనలు అక్కడక్కడా చోటు చేసుకుంటున్నాయి.అలాంటి సంఘటన ఇటీవల..దుండిగల్ రెవెన్యూ పరిధిలో ఒకటి వెలుగులోకి వచ్చింది. రెవెన్యూ రికార్డులో సర్కార్ భూమి,చెరువు భూమిగా చూపుతుండగా 1989 రికార్డుల ప్రకారం వక్ బోర్డు భూమిగా చూపుతున్న సదరు ల్యాండ్ ను గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఇనామ్ భూమి పేరుతో అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు,ఓ మాజీ కార్పొరేటర్ అడ్డదారిలో రిజిస్టర్ చేసుకున్నాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దుండిగల్-గండిమైసమ్మ రెవెన్యూ పరిదిలోని బౌరంపేటలో ఉన్న సర్వే నంబర్ 663,664,665,716 లో జరుగుతున్న తతంగం ఇది 1989 రియార్డుల ప్రకారం వక్ బోర్డు భూమిగా ఉన్న ఈ స్థలం కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి క్రయ విక్రయాలు చేశారు,వక్స్ భూములు అమ్మడం కాని కొనడం కానీ చేయరాదు కానీ కోర్టులను,న్యాయ స్థానాలను తప్పుదోవ పట్టిస్తూ కబ్జారాయిల్లు అక్రమంగా వందల కోట్ల రూపాయల విలువైన భూములను కొట్టేస్తున్నారు.



**వక్ఫ్ బోర్డు భూములు కొట్టేసేందుకు భారీ ప్రణాళిక వేసినట్లేనా..?**

వక్స్ భూములు ప్రభుత్వ భూములు,ఇనామ్ భూములపై కన్నేశారు,కొందరి ఆర్ధిక పరిస్థితులు ఆసరాగా చేసుకున్న కబ్జా రాయుళ్ళు వక్స్ భూములను కొట్టేసేందుకు పక్కా స్కెచ్ వేస్తున్నారు,ఈ క్రమంలో తక్కువ రేటుకు కొట్టేయడం, తప్పుడు పత్రాలు సృష్టించి అడ్డదారిలో రిజిస్ట్రేటిన్స్ చేసుకోవడం నగర శివారు ప్రాంతాల్లో తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఓ మాజీ కార్పొరేటర్ అధికారులను మ్యానేజ్ చేస్తూ వక్స్ భూములను కారుచోకగా కొట్టేసి అక్రమాలకు తెర లేపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.బౌరంపేటకు చెందిన సుమారు 2 ఎకరాల 7 గుంటల భూమిని అడ్డదారిలో కాజేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వే నంబర్ 663లో ఒక ఎకరా 30 గుంటలు,సర్వే నంబర్ 664 లో 0.24 గుంటలు సర్వే నంబర్ 665 లో 0.37 గుంటలు సర్వే నంబర్ 716 లో 0.16 గుంటలు 1989 ఫిబ్రవరి 16 వరకు వక్స్ భూమిగా చూపుతుండగా ప్రస్తుత ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లడం దాని వెనక ఎవరెవరు ఉన్నారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.వక్ బోర్డు,రెవెన్యూ అధికారులు ఇప్పటికైనా సర్వే నంబర్లపై దృష్టి పెట్టి వక్స్ ల్యాండ్లను,ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



**బౌరంపేటలో ఖరీదైన భూములు**

బౌరంపేటలో కార్పొరేట్ పాఠశాలలు,కరీదైన విల్లాల నిర్మాణాలు నిర్మించడంతో పాటు పక్కనే ఔట రింగ్ రోడ్డు ఉండడం నగర శివారులో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం కావడంతో భూముల రేట్లు అమాంతం పెరిగాయి. అదునుగా భావించిన కొందరు బూ బకాసురులు ప్రభుత్వ భూములు,వక్ బోర్డు ల్యాండ్లపై కన్నేశారు,పాత రికార్డుల ప్రకారం వక్స్ భూములుగా ఉండగా, రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్కారు భూమి చెరువు భూమి చూపుతుంది నఖిలీ పత్రాలు సృష్టించి భూమి తమదిగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి,ఇటీవల భూమిని చదును చేసిన కబ్జాదారాలు నిర్మాణాలు చేపట్టేందుకు అనువుగా మున్సిపల్ అధికారులను మ్యానేజ్ చేసి రోడ్డు నిర్మాణానికి తెరలేపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వక్ బోర్డు,రెవెన్యూ అధికారుల సమన్వయ లోపంతో వక్స్ భూములు అన్యాక్రాంతం అవుతుండడం ఆందోళన కలిగించే విషయం,భూముల విలువల కోట్లల్లో ఉండడంతో ప్రణాళికా బద్దంగా భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**వక్ఫ్ భూములని తేలితే చర్యలు తీసుకుంటాం తహశీల్దార్, ఎన్.రాజేశ్వర్ రెడ్డి**

బౌరంపేట సర్వే నంబర్ 663,664,665,716 వక్ బోర్డు భూముల అన్యాక్రాంతంపై దుండిగల్-గండిమైసమ్మ మండల తహశీల్దార్ ఎన్. రాజేశ్వరరెడ్డిని అక్షిత ప్రతినిధి వివరణ కోరగా వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అయినట్లు పత్రికల ద్వారా మా దృష్టికి వచ్చిందన్నారు. వక్ఫ్ బోర్డు అధికారులకు సమాచారం అందించామని వక్స్ భూములు కాపాడాల్సిన బాధ్యత పూర్తిగా వక్ బోర్డు అధికారులదే అన్నారు. జాయింట్ సర్వే కోసం ప్రతి పాదనలు పంపితే తప్పక చర్యలు తీసుకుంటామన్నారు.

# ఏదైనా సాధించాలంటే త్యాగాలు చేయాల్సిందే

## విశ్రాంత సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ




**మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి:** జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే కష్టపడటమే కాకుండా త్యాగాలు కూడా చేయాల్సి ఉంటుందని విశ్రాంత సీబీఐ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నగరంలోని బోయపల్లి వైటిసి బిల్డింగ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 150 మంది పదవ తరగతి విద్యార్థులకు ఐఐఐటీ కళాశాలలో సీటు సాధించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణా శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గత 42 రోజులుగా కొనసాగుతున్న ఈ శిక్షణా కార్యక్రమం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో మహబూబ్ నగర్ ఫస్ట్ మరియు వందేమాతరం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడుతోంది. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నప్పటి నుంచే పెద్ద లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించడానికి క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు. విజయాన్ని సాధించాలంటే సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, పట్టుదలతో చదవడం, లక్ష్యసాధన పట్ల నిబద్ధత కలిగి ఉండటం చాలా అవసరమని చెప్పారు. విద్యార్థులు కేవలం పరీక్షల్లో మంచి మార్కులు సాధించడమే కాకుండా సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తన గురువు అబ్దుల్ కలామ్ ని స్మరించుకుంటూ, ఒక ప్రజాప్రతినిధి ఎలా ఉండాలో ఆయన ఎప్పుడూ చెప్పేవారని తెలిపారు. అదే విధంగా మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న తీరు ఆదర్శప్రాయమని ప్రశంసించారు. వారిని చూసి తమ గురువు " లిప్రజాప్రతినిధులు ఎలా ఉండాలి"లి అనే పుస్తకం రాశారేమో అనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా ఇలాంటి ప్రజాప్రతినిధులు ఉంటే దేశ అభివృద్ధికి ఎలాంటి ఆటంకం ఉండదన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మహబూబ్ నగర్‌లో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే ఒక మంచి ప్రయోగాన్ని ప్రారంభించారని ఆయన అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఐఐఐటీ ప్రవేశాలకు ప్రత్యేక శిక్షణ అందించడం అభినందనీయమని తెలిపారు. భవిష్యత్ భారతదేశానికి ఉత్తమ పౌరులను తయారు చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుండటం గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా విద్యార్థులు ఐఐఐటీలో అత్యధిక సంఖ్యలో సీట్లు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఇక్కడ నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు విద్యార్థులపై మంచి ప్రభావం చూపుతున్నాయని, వారు క్రమశిక్షణతో చదివితే మంచి ఫలితాలు సాధించగలరని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలనే సంకల్పం, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా ఉన్నత విద్యలో అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. విశ్రాంత జేడీ లక్ష్మీనారాయణ విద్యార్థులతో మాట్లాడి వారికి ప్రేరణనిచ్చినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మహబూబ్ నగర్ అభివృద్ధి కోసం కూడా వారి సూచనలు, సలహాలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వందేమాతరం ఫౌండేషన్ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, రామకృష్ణ మఠం కోఆర్డినేటర్ రాజా మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.






# సిద్దూర్ గ్రామంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**నిర్మల్ అక్షిత బ్యూరో:** భైంసా మండలంలోని సిద్దూర్ గ్రామపంచాయతీ పరిధిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా శక్తి సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా మహిళల సాధికారత, సమాజ అభివృద్ధిలో వారి పాత్రపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ మాలెప్ దుర్పతి బాయి ముఖ్య అతిథిగా హాజరై మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



ఉప సర్పంచ్ అవినాష్ మాట్లాడుతూ మహిళా సంఘాలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కైసర్, రాములు, వార్డ్ సభ్యులు, గ్రామ మహిళలు మరియు మహిళా శక్తి సంఘం సభ్యులు పాల్గొని మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమం అనంతరం మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో హ్యాపీ సండే"







**మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 6 నుండి 9 గంటల వరకు "హ్యాపీ సండే" కార్యక్రమాన్ని మహబూబ్ నగర్ స్టేడియం కమాన్ – కొత్త బస్టాండ్ ప్రధాన రోడ్డు కూడలి వద్ద మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రుణమాఫీ, 10 లక్షల ఆరోగ్య బీమా, స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఋణాలు ఇతర సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో కళాకారులు ఆట పాటలతో ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్నారుల చేత సాంస్కృతిక డాన్స్ కార్యక్రమాలు, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా ఇన్స్ట్రక్టర్ల చేత యోగాసనాల కార్యక్రమం నిర్వహించి యోగా చేయడం వల్ల వచ్చే ఆరోగ్య ఫలితాలను ప్రజలకు వివరించారు. అలాగే లాఫింగ్ థెరపీ నిర్వహించి నవ్వడం వల్ల మనిషికి రోజువారి పని వత్తిడి నుండి మానసిక ఉల్లాసం కలిగి ఆరోగ్యంగా ఉంటారని నిర్వాహకులు వివరించారు. సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు కూడా ఉత్సాహంగా ఆటలు ఆడి పాటలు పాడి వారి అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో స్వయం సంఘాల సభ్యుల ద్వారా స్టాళ్లను ఏర్పాటు చేసి వారు తయారుచేసిన పౌష్టిక ఆహార పదార్థాలను, ఇతర వస్తువులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మేయర్ జి. మమత, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఉమర్ కొత్వాల్, సీనియర్ సిటిజన్ ఫోరం సంఘం సభ్యులు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమాజ రక్షణలో మహిళా పోలీసుల సేవలు అమూల్యం



**మందమర్రి, అక్షిత ప్రతినిధి :** సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మహిళా పోలీసుల సేవలు అమూల్యమని అధికారులు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మందమర్రి పోలీస్ స్టేషన్‌లో మహిళా శక్తిని గౌరవిస్తూ ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్‌ను ఎస్ఐ జి. నరేష్, సహచర సిబ్బంది శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణలో మహిళా పోలీసులు పురుషులతో సమానంగా ధైర్యసాహసాలతో విధులు నిర్వర్తిస్తున్నారని అధికారులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మజీద్ ఖాన్, స్టేషన్ రైటర్, కానిస్టేబుళ్లు, హోం గార్డులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



## నూతన మసీదు నిర్మాణం కోసం ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సత్తుపల్లి పట్టణంలో అశ్వారావుపేట రోడ్డు చివరిలో గల జేవిఆర్ పార్క్ ఎదురుగా డబుల్ బెడ్ రూమ్ గృహముల వద్ద నూతనంగా మసీదు నిర్మాణం కొరకు ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ లకు వినతి పత్రాన్ని అందజేసారు సత్తుపల్లి జామే మజీద్ కమిటీ సభ్యులు మరియు ముస్లిం సోదరులు.తప్పకుండా పరిశీలించి సమస్య పరిష్కారం చేస్తాం అని ఎమ్మెల్యే మట్టా దంపతులు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ యండి రెహానా బేగం కమల్ పాషా,జామే మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ నాయబ్ రసూల్,కమల్ పాషా, ఉపాధ్యక్షుడు షేక్ యూసుఫ్, అమీర్ జానీ,మున్వర్ ఖాన్, షరీఫ్,నాగుల్ మీరా, జానీ,అబ్దుల్ మజీద్, ఇబ్రహీం వలీ, సాదిక్, ఇబ్రహీం, యాకూబ్ అలీ,సలీం,మీరా ,మోయిన్, తదితరులు పాల్గొన్నారు.

## అహింసకు ప్రతిరూపం మహిళ

### జిల్లా కలెక్టర్ డా. సత్య శారద






**వరంగల్, అక్షిత బ్యూరో:** అహింసకు ప్రతిరూపం మహిళ అని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్‌లోని ఓ సిటీ క్రీడా మైదానంలో ఆదివారం మేరా యువ భారత్ వరంగల్ ఆధ్వర్యంలో వివిధ రకాల క్రీడా పోటీలను ఘనంగా నిర్వహి ంచారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డా. సత్య శారద క్రీడా పోటీలను ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా కలెక్టర్మాట్లాడుతూ మహిళలు ఓర్పు, సహనం, అహింసకు ప్రతిరూపమని అన్నారు. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చి తమ ప్రతిభను చాటుకో వాలని పిలుపు నిచ్చారు. మహిళల సాధికారత సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు మరియు ప్రశంసాపత్రాలను జిల్లా కలెక్టర్ అందజేసి అభినందించారు. మహిళల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ పుష్పలత, వివిధ శాఖల అధికారులు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

### క్యాంటీన్ నిర్వాహకురాలు ను సన్మానించి కలెక్టర్





**వరంగల్, అక్షిత బ్యూరో:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీవో సుమ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. అనంతరం మహిళల సాధికారత, సమాన హక్కులు, విద్యా అభివృద్ధి మరియు సమాజ అభివృద్ధిలో మహిళల పాత్రపై అధికారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.మహిళలు కుటుంబ నిర్మాణంలోనే కాకుండా దేశ అభివృద్ధిలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. విద్య, ఉపాధి, పరిపాలన, వ్యాపారం, విజ్ఞానం, రాజకీయాలు వంటి అన్ని రంగాల్లో మహిళలు తమ ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మహిళల గౌరవం, భద్రత, సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ క్యాంటిన్ నిర్వాహకురాలు శ్రీదేవిని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సన్మానించారు. ముద్ర రుణం పొందుతూ స్వయం ఉపాధి ద్వారా కుటుంబ పోషణలో విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదిగిన ఆమె ఇటీవల ప్రధానమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం గర్వకారణమని కలెక్టర్ అభినంది ంచారు. ఆమె సాధించిన విజయం ఇతర మహిళలకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ విశ్వ ప్రసాద్‌తో పాటు జిల్లా కలెక్టరేట్‌కు చెందిన వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పొనుగోడులో శ్రీ అక్షిత లాప్రోస్కోపిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

### ప్రారంభించిన సర్పంచ్ కటికం వేణు...




**గరిడేపల్లి అక్షిత ప్రతినిధి....**గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో మిర్యాలగూడలోని శ్రీ అక్షిత లాప్రోస్కోపిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం పొనుగోడు గ్రామంలో భారీ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కటికం వేణు జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కటికం వేణు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత పేద ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, ఉచితంగా వైద్య పరీక్షలు మరియు మందులు పంపిణీ చేస్తున్న శ్రీ అక్షిత హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు. ప్రజలు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ గోపీనాథ్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ అక్షిత రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానంగా లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు, జనరల్ సర్జరీ మరియు ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన సలహాలను రోగులకు అందించారు.మార్కెటింగ్ మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో శిబిరానికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. సుమారు 100 మందికి పైగా గ్రామస్తులకు ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కటికం ఆషా రమేష్ గ్రామ వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, ప్రాక్టీషనర్స్ మంగ సతీష్, మల్లికటి శ్రీనివాస్, నరసింహస్వామి, ప్రేమ్. రేఖ శేఖర్.హాస్పిటల్ సిబ్బంది కందుల ప్రవీణ్, నాగరాజు, అరుణ కుమారి, వేణు మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తమ గ్రామంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

## దేగాం గ్రామంలో మహిళా దినోత్సవ వేడుకలు....!

### పల్లె ప్రగతి అవగాహన కార్యక్రమం



**ఆర్మూర్,అక్షిత ప్రతినిధి:**ఆలూరు మండలం దేగాం గ్రామపంచాయతీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ ఇట్టడి లింగారెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ ధర్మపురి, వార్డ్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఉమ, మహిళా సంఘం అధ్యక్షులు, సీసీలు, అంగన్వాడీ ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు మరియు గ్రామపంచాయతీ మహిళా సిబ్బందికి శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఇట్టడి లింగారెడ్డి మాట్లాడుతూ మహిళలు చదువు, ఇల్లు, ఉద్యోగం మాత్రమే కాకుండా రాజకీయాలు, క్రీడలు, వ్యాపారం వంటి అన్ని రంగాల్లో ముందుండి రాణించాలని ఆకాంక్షించారు.అనంతరం ప్రజా పాలన -- పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి పొడి చెత్త, తడి చెత్త వేరు చేసి ఇవ్వాలని గ్రామస్థులకు సూచించారు. చెత్తను గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లో వేయాలని తెలియజేస్తూ గ్రామంలో ప్రచారం చేపట్టారు.ఈ కార్యక్రమ ంలో సర్పంచ్ ఇట్టడి లింగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఉమ, ఉపసర్పంచ్ ధర్మపురి, ఫీల్డ్ అసిస్టెంట్ సుదర్శన్ గౌడ్, వార్డ్ సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మహిళా సమాఖ్య సీసీలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల ఉపాధిని దెబ్బతీసే

# వి.బి.జీ. రామ్‌జీ పథకాన్ని రద్దు చేయాలి

**ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ) రాష్ట్ర కార్యదర్శి శిరోమణి డిమాండ్**




**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** మహిళల ఉపాధిని దెబ్బతీసే వి.బి.జీ. రామ్ జీ పథకాన్ని రద్దు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ) రాష్ట్ర కార్యదర్శి శిరోమణి డిమాండ్ చేశారు. 2026 అంతర్జాతీయ మహిళా పోరాటం దినోత్సవ సందర్భంగా పిఓడబ్ల్యూ మండల కమిటీ ఆధ్వర్యం లో స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో మండల అధ్యక్షురాలు గంటా వెంకటనరసమ్మ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. .సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని శిరోమణి ప్రసంగించారు.

గత పది సంవత్సరాలుగా బీజేపీ, మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానా లలో భాగంగానే మహాత్మాగాంధీ ఉపాది హామి చట్టం పేరుమార్చటం,2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా వి.బి.జీ రామ్ జీ పథకాన్ని పార్లమెంట్లో ఆమోదించిందని, ఉపాధి హామీ చట్టాన్ని ఎందుకు రద్దు చేశామంటే లోపాలు న్నాయని పాలకులు సమర్ధించుకుం టున్నారని ఆరోపించారు.ఉపాధి హామీ చట్టం 2005లో వచ్చిందని,ఈ చట్టం ద్వారా ఉపాధి లేని పేదలకూ, వృద్ధులకూ, వికలాంగులకూ, నైపుణ్యం లేని వారికి పని హక్కును కల్పించిందని,ఉపాధి కూలీలుగా పనిచేస్తున్న వారిలో 60% మంది మహిళలే వున్నారని ఆమె తెలిపారు.అంతేగాకుండా మహిళా సమాన వేతన చట్టం అమలవుతుందని, ఉపాధి కోసం ఇతర చోట్లకు పోకుండా స్థానికంగా పనిచేసే అవకాశం వుందని అన్నారు. ఉపాధి దొరకటం వల్ల పేదరికంలో వున్న వారికి వచ్చే ఆధాయం కుటుంబ అవసరాలకు ఉపయోగప డుతుందని ఇటువంటి చట్టాన్ని వద్దు చేయటమంటే ప్రజల ప్రాథమిక హక్కుపై దాడి చేయటమేనని అన్నారు.మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో కార్మికవర్గం, ప్రజల, మహిళల సమస్యలు మరింతగా పెరిగాయని,వీరి హక్కులపై దాడికి పూనుకుందని,కార్మిక చట్టాలను రద్దు చేసిందని, ప్రజాస్వామ్యయుత హక్కుల పైన దాడులకు పూనుకొన్నదని ఆమె ఆరోపించారు. పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షులు గోకినేపల్లి లలిత మాట్లాడుతూ వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, అసంఘటిత రంగం, సంఘటిత రంగాల్లో దాదాపు 50% మంది పనిచేస్తున్నారని, ఉద్యోగ, ఉపాధి భద్రతలేదని, వేతనాల్లో వివక్ష ఎదుర్కొంటు న్నారని,సమాన పనికి సమాన వేతన చట్టం వచ్చి దశాబ్దాలు గడిచాయని,సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చినా పాలకులు ఖాతరు చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**అంతర్జాతీయ మహిళా పోరాట దినోత్సవం వక్రీకరణ**

అంతర్జాతీయ మహిళా పోరాట దినోత్సవానికి ఎంతో ప్రాధాన్యత వుందని, చారిత్రక పోరాటాల నేపథ్యం వుందని, కొన్ని బూర్జువా శక్తులు మహిళా దినోత్సవాన్ని, పోరాట దినోత్సవంగా కాకుండా, ఇదొక పండుగలా సన్మానాలు, సంబరాలు చేసుకుంటూమహిళలని పక్కదారి పట్టిస్తున్నారు అనిఅన్నారు.న్యూయార్క్ నగరంలో పరిశ్రమల్లో పనిచేసే మహిళా కార్మికులు పని గంటల తగ్గింపు కోసం, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా,వేతనాలు పెరుగుదల కోసం పోరాడి హక్కులు సాధించుకున్న రోజు అని,హక్కుల సాధన కోసం మహిళలు రక్త తర్పణాలు చేసిన రోజు 1908 మార్చి 8 ని ప్రపంచ మహిళల పోరాట దినోత్సవంగా జరుపుకోవాలని 1910 సంవత్సరము కోపెన్ హెగిన్ లో జరిగిన మహాసభలో జర్మనీ కమ్యూనిస్టు పార్టీ నాయకురాలు కార్లా జట్కిన్ ప్రతిపాదించి ఆమోదింప చేశారని తెలిపారు.ప్రపంచ వ్యాప్తంగా యుగాలు మారినా, తరాలు మారినా,మహిళల తలరాత మారలేదని,అసమానత్వం, అణచివేత, వివక్ష ,

పురుషాధిక్యత వంటి సమస్యలు సమసి పోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.మహిళా లోకం ఎదుర్కొంటున్న సమస్యల । పరిష్కారం కోసం ముందుకు సాగటమే మార్చి 8 సందర్భంగా మన కర్తవ్యాన్ని దృఢంగా కొనసాగించాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు గంటా శ్రీను అమర్లపూడి శరత్ మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి సుకన్య చెల్లమ్మ రంగమ్మ దుర్గ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

# భూగర్భ డ్రెయినేజీ మంజూరీ చేయించిన సీఎంకు థాంక్స్

**సీఎం ను కలిసిన వరంగల్ నేతలు**



**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ మహాన గరానికి భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ (అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ) ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5,257.20 కోట్లకు పాలనాపరమైన మంజూరు ఇవ్వడం పట్ల శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య వరంగల్ కడియం కావ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా వరంగల్ నేతలు మాట్లాడుతూ వరంగల్ మహానగరానికి భూగర్భ డ్రెయినేజీ ప్రాజెక్టు మంజూరు చేయడం ద్వారా దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రజల కలను ముఖ్యమంత్రి నెరవేర్చారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ వరంగల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో రెండో ప్రధాన నగరంగా మహానగరాన్ని అభివృద్ధి చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. మౌలిక సదుపాయాలు, వైద్య, విద్య, రవాణా తదితర అన్ని రంగాల్లో వరంగల్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్ర మాలను వేగంగా అమలు చేస్తోందని అన్నారు. భూగర్భ డ్రెయినేజీ ప్రాజెక్టు అమలుతో నగరంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు వరద ముంపు సమస్యలు కూడా తగ్గుముఖం పడతాయని పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టు వరంగల్ మహానగర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. రెండో రాజధానిగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పలు కీలక ప్రాజెక్టులను అమలు చేస్తున్నదని చెప్పారు. త్వరలోనే మామునూర్ ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని, అలాగే రైల్వే వ్యాగన్ ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ స్థాపనతో పాటు కాకతీయ టెక్స్‌టైల్ పరిశ్రమల ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు అమలులోకి వస్తే వరంగల్ పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో కొత్త దశకు చేరుకుంటుందని నేతలు స్పష్టం చేశారు.

# ఉచిత హెచ్ పి వి వ్యాక్సినేషన్ ప్రారంభం




**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:**కాగజ్నగర్ పట్టణంలోని సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత ఎస్పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ సాహిన్ సుల్తానా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ మహిళల్లో వచ్చే గర్భాశయ క్యాన్సర్ నివారణకు ముందస్తుగా వాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి సీతారాం మాట్లాడుతూ 14-15 బాలికలకు వ్యాక్సినేషన్ జిల్లా వ్యాప్తం గా అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో వేయడం జరుగుతుందన్నారు . దీనికోసం వారు ఆన్లైన్లో లేదా సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనిసూసించారు.

# ప్రభుత్వ కార్యాలయాలు శుభ్రత పై ప్రజలకు మంచి సందేశం ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్**



**వరంగల్, అక్షిత బ్యూరో:** ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొని కార్యాలయ పరిసరాలు మరియు చాంబర్లను పరిశుభ్రం చేసే కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది కలిసి కార్యాలయ గదులు, కారిడార్లు, సమావేశ మందిరాలు ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. కార్యాలయ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యకరమైన సానుకూలమైన పని వాతావరణం ఏర్పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రతను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు కూడా పరిశుభ్రతపై మంచి సందేశం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని ఏవో విశ్వ ప్రసాద్, వివిధ విభాగాల పర్యవేక్షకులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కొత్తగూడెంలో ర్యాలీ

**ఏజెన్సీ వ్యవస్థ రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని డిమాండ్.**

**ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావుకు ప్రతినిధుల వినతి పత్రం.**




భద్రాద్రి కొత్తగూడెం: అక్షిత న్యూస్. తెలంగాణ రాష్ట్ర ఔట్సోర్సింగ్ జేఏసీ పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ర్యాలీ నిర్వహించారు. కొత్తగూడెం అమరవీరుల స్థూపం నుండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ఉద్యోగులు భారీగా ర్యాలీగా వెళ్లి తమ డిమాండ్లను వెల్లడించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు కు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల తరఫున ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఉన్న ఐదు లక్షల పైచిలుకు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని, దళారీ వ్యవస్థగా మారిన ఏజెన్సీ విధానాన్ని తక్షణమే రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా కార్పొరేషన్ ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ప్రతి ఉద్యోగికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఏజెన్సీల ద్వారా జీతాల చెల్లింపులో జాప్యం జరుగుతోందని, కమిషన్లు తీసుకోవడంతో పాటు జీఎస్టీ భారాన్ని కూడా ఉద్యోగులపై మోపుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఇంద్రపార్క్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో మానవహారాలు నిర్వహించడంతో పాటు రాబోయే రోజుల్లో ఇంద్రపార్క్ వేదికగా మహాధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్‌లో "చలో ఢిల్లీ" కార్యక్రమం నిర్వహించి ఏజెన్సీ వ్యవస్థ రద్దు అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తుల చైర్మన్ మరియు అధ్యక్షుడు పులి లక్ష్మయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు దిలీప్ కుమార్, జనరల్ సెక్రటరీ అన్వేష్, ట్రెజరర్ శ్రీనివాస్, జేఏసీ నాయకులు రషీద్, నిర్మల్, అన్వర్, పద్మ, మౌనిష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా చైతన్యమే సమాజ అభివృద్ధికి మూలం

**బుర్రి ఇందిరా**





ఖమ్మం /అక్షిత బ్యూరో : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా స్థానిక పిఆర్టియు జిల్లా కార్యాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించబడింది. ముఖ్యఅతిథిగా హాజరైన డివిజన్ కౌన్సిలర్ బుర్రి ఇందిరా మాట్లాడుతూ మహిళ చైతన్యమే సమాజ అభివృద్ధికి మూలము అని సూచిం చారు. పిఆర్టియు మహిళా విభాగం ఆధ్వర్యంలో పిఆర్టియు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మహిళలు హాజరైనారు వివిధ రకాల ఆటల పోటీలతో చిరునాటి బాల్యాన్ని గుర్తు తెచ్చుకున్నారు. ఆటపాటలతో హాయిగా గడిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా అధ్యక్షులు కట్ట శేఖర్ రావు ఆర్ రంగారావు మహిళా నాయకులు సుజాత భారతి రెహనా నఫీజ రాజకుమారి రాయల మాధవి స్నేహలత కస్తూరి శ్రీదేవి కేజీబీవీ అధ్యక్షురాలు ఝాన్సీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్వీఎస్ ఆసుపత్రి సేవలు అమోఘం

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**ఎస్వీఎస్ జననీ కిట్ ప్రారంభించిన ఎమ్మెల్యే**




మహబూబ్ నగర్,అక్షిత న్యూస్: మహబూబ్ నగర్ నగరంలోని ఎస్వీఎస్ ఆసుపత్రి ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సేవా దృక్పథంతో ఎస్వీఎస్ సంస్థలు గత 27 సంవత్సరాలుగా ఉమ్మడి మహబూబ్ నగర్ ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు అత్యంత గొప్పవని ఎమ్మెల్యే ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎస్వీఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రూపొందించిన లిజననీ కిట్‌లి ను ఎమ్మెల్యే ఆవిష్కరించి, లబ్ధిదారులకు అందజేశారు. గర్భిణీలు మరియు ప్రసవం అనంతరం తల్లులకు , మరియు నవజాత శిశువులకు అవసరమైన వస్తువులతో రూపొందించిన ఈ కిట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఆరోగ్య పరిరక్షణలో ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని ఆయన పేర్కొన్నారు. తాను కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం అయిన నవజాత శిశువుల తల్లులకు లియెన్నం హెల్త్ కిట్‌లి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని, తల్లులు మరియు శిశువుల ఆరోగ్యం మెరుగుపడేందుకు ఇది దోహదపడుతోందని ఆయన వివరించారు. అదేవిధంగా ఎస్వీఎస్ విద్యాసంస్థలు వైద్య విద్యలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత కొన్నిదశాబ్దాలుగా ఎస్వీఎస్ కళాశాలల ద్వారా వేలాది మంది విద్యార్థులు డాక్టర్ పట్టాలు పొందారని తెలిపారు. ఆ విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో సేవలందిస్తూ మహబూబ్ నగర్ పేరు ప్రఖ్యాతలను పెంచుతున్నారని అన్నారు. ఇది మహబూబ్ నగర్ ప్రజలకు మాత్రమే కాకుండా ఎస్వీఎస్ సంస్థకు కూడా గర్వకారణమని ఆయన అభిప్రాయపడ్డారు. సంవత్సరం కాలం పాటు ప్రసవం అయిన మహిళలకు వారి బిడ్డలకు ఉచితంగా వైద్యం అందించేందుకు ఎస్వీఎస్ ఆసుపత్రి ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, కార్పొరేటర్లు పెద్దగొల్ల వసంత నర్సింహులు,

రామస్వామి, ఎస్వీఎస్ సంస్థ సభ్యులు కె.జి. రెడ్డి, కె.కె. రెడ్డి, డాక్టర్ రామిరెడ్డి, నాయకులు మైత్రి యాదయ్య, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.









# డిఫాల్ట్ మిల్లర్లపై విధించిన 25 శాతం ఫెనాల్టీని ఎత్తి వేయాలి

**ప్రభుత్వం అదనంగా 12 శాతం వడ్డీని మిల్లర్లపై రుద్దడం సరికాదు....**

**దీనివల్లనే మిల్లర్ బార్య స్వప్న ఆత్మహత్య చేసుకుంది**

**రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొండమీది గోవింద రావు ఆరోపణ**



సూర్యాపేట , అక్షిత ప్రతినిధి : జిల్లాలో ఉన్న డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై ప్రభుత్వం విధించిన 25 శాతం పెనాల్టీతో పాటు అదనంగా 12 శాతం వడ్డీని ప్రభుత్వం ఎత్తివేయాలని రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కొండమీది గోవింద రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం లేకపోవడం వల్లనే జిల్లాలోని కొందరు మిల్లర్లు ప్రభుత్వానికి అందించే సిఎంఆర్ రైస్ తగిన సమయంలో అందించక పోవడం వల్ల అధికారులు వాటిని డిఫాల్ట్ లిస్టులో ఉంచడమే కాకుండా సంబంధిత శాఖ అధికారులు కేసులు పెడతామంటూ బెదిరిస్తున్నారని,ఇలా బెదిరించడం వల్లే గత మూడు రోజుల క్రితం కరీంనగర్ జిల్లాకు చెందిన మిల్లర్ తణుకు సురేష్ భార్య స్వప్న భయపడి ఆత్మహత్య చేసుకుందని ఆయన ఆరోపించారు. రైతులకు ప్రభుత్వాలకు మధ్య వారధిగా ఉంటున్న మిల్లర్ వ్యవస్థ ఉందన్నారు. అందుకోసం ప్రభుత్వం మరో మారు ఆలోచించి డిఫాల్ట్ మిల్లర్లపై విధించిన 25 శాతం ఫెనాలిటీతో పాటు 12 శాతం వడ్డీని ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. మిల్లర్లపై ఇంత కఠిన వైఖరి ప్రదర్శించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది మిల్లర్లను సంబంధిత అధికారులు క్రిమినల్ లాగా వివిధ ఛానళ్లలో, పత్రికలలో చూపుతున్నారని ఆరోపించారు. తమకి కూడా గత 12 ఏళ్లుగా కస్టోడియన్ చార్జీలు,డ్రైయేజ్ చార్జిలు ,మిల్లింగ్ చార్జీలు, ట్రాన్స్పోర్ట్ చార్జీలు,ఎఫ్ఆర్కే మిక్సింగ్ చార్జీలు గత 12 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. కూడా ప్రభుత్వాలు మిల్లర్లపై ఫెనాల్టీ వేసినట్లుగానే మాకు ఇవ్వాల్సిన బకాయిలను కూడా ఫెనాల్టీతో కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అనుసంధానం లేక మిల్లర్లను ఒత్తిళ్లకు గురి చేసి ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. ఈ విషయంపై గతంలోనే తాము సంబంధిత శాఖ మంత్రికి, అధికారులకు విన్నవించినట్లు చెప్పారు.

ఈ సందర్భంగా స్వప్న మృతి పట్ల మిల్లర్లు సంతాపం ప్రకటిం చారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు అనూప్ రెడ్డి,

శంకర్ రావు,సైదులు, రంగిశెట్టి నరసింహా రావు,శంకర్,కె.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ఆడపిల్లలకు సమాన హక్కులు మరియు

# స్త్రీ హింస లేని నవ సమాజాన్ని నిర్మిద్దాం

### సిడబ్ల్యూసి చైర్ పర్సన్ భారత రాణి

### ఎయిడ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం





**ఖమ్మం /అక్షిత బ్యూరో :** మహిళలు ఆడపిల్లలకు అన్ని రంగాల్లో సమాన హక్కులు లభించేలా స్త్రీ హింసకు తావులేని నవ సమాజాన్ని నిర్మించడానికి మనమందరం పాటుపడాలని జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ గుంటుపల్లి భారత రాణి పిలుపునిచ్చారు. ఎయిడ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన సంక్షేమ కళాశాల బాలికల హాస్టల్ ఎన్ఎస్పి క్యాంపు నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో సమాన అవకాశాలను పొందాలంటే ఒక్క విద్య ద్వారానే అది లభిస్తుందని అన్నారు. నవభారత నిర్మాణంలో మహిళలు ఆడపిల్లలు కీలక పాత్ర పోషించబోతున్నారని వారు అన్ని రంగాల్లో రాణిస్తూ భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు. సమయపాలన స్వీయ క్రమశిక్షణ పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించి భారతావనికి సేవ చేయాలని పిలుపునిచ్చారు.

మరో అతిధి వీరభద్రమ్మ అర్బన్ సిడిపిఓ మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా వివిధ రకాల పథకాలతో బాలల మహిళల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. కౌమార దశలో ప్రేమ ఆకర్షణలకు లోను కాకుండా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నిరంతర సాధన చేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆత్మగౌరవంతో జీవించేలా కళాశాల స్థాయి నుంచి వ్యక్తిత్వ నిర్మాణం జరగాలని సూచించారు. భరోసా ఎస్సై షాహినా మాట్లాడుతూ 16 నుంచి 24 సంవత్సరాల వయసులోని మన యొక్క భవిష్యత్తు నిర్మాణం జరుగుతుందని మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మనల్ని మనం ఆత్మ పరిశీలన చేసుకుని జీవితంలో స్థిరపడేలా ప్రణాళికలు రచించుకోవాలని సూచించారు. సెల్ ఫోన్ వల్ల కలిగే అనర్థాలను మరియు వివాహానికి ముందే చదువుకు తగిన అర్హత కలిగిన ఉద్యోగం పొందాలని ఆకాంక్షించారు. తద్వారా గృహహింస స్త్రీ హింస ను అరికట్ట వచ్చుని సూచించారు. ఎయిడ్ సేవా సంస్థ డైరెక్టర్ పి ఎస్ ఎస్ హరి ప్రసాదరావు మాట్లాడుతూ లింగ సమానత్వం అనేది ఇంటి నుంచి ప్రారంభం కావాలని అన్నారు బాలబాలికలను సమానంగా చూడడం సమాన విద్యా అవకాశాలను కల్పించడం ఆడపిల్లలకు ఇష్టమైన రంగంలో ఎదిగేలా ప్రోత్సహించడం ద్వారా స్త్రీ సాధికారిక సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. తమ సంస్థ ద్వారా బాలలు మహిళల యొక్క సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు ఈ సంవత్సరం మహిళలు మరియు బాలికల హక్కులు న్యాయం కొరకై చర్య అను నినాదంతో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం ఖమ్మం జిల్లా అధ్యక్షులు కోటపాటి రుక్మారావు మాట్లాడుతూ జిల్లా మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే యువతలు సామాజిక మాధ్యమాలు సెల్ ఫోన్ ఇంటర్నెట్ అంటూ కాలయాపన చేయకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని కెరియర్ కు ఎటువంటి ఒడిదొడుకులు లేకుండా సాఫీగా జీవితంలో స్థిరపడే విధంగా వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులుకు గ్రామానికి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సమ సమాజ స్థాపనకు తమ వంతు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం హాస్టల్స్ లో అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం నిర్వహించే వసతి గృహాల్లో చదివిన విద్యార్థులు మంచి వ్యక్తిత్వ నిర్మాణంతో విజయం సాధించాలని ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని కోరారు. విదేశీ ఉన్నత విద్యకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా అతిధులందరినీ శాలువా బొకేలతో సత్కరించారు ప్రత్యేకంగా హాస్టల్ నందు వంట చేస్తున్న మహిళలను కూడా శాలువా మరియు బొకేలతో అతిధులందరి చేతులమీదగా సత్కరించడం జరిగింది.

అనంతరం యువతులకు మిఠాయిలు పంచి పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమం నందు ఎయిడ్ సేవా సంస్థ డైరెక్టర్ పి ఎస్ ఎస్ హరి ప్రసాదరావు కోఆర్డినేటర్ కె శ్రీనివాస్ వాణి హరి ప్రసాద్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు వార్డెన్ సిహెచ్ నాగమణి టీం సభ్యులు రాందాస్ రవిచంద్ర మిత్ర ఏఎన్ఎం సౌజన్య మరియు హాస్టల్ విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్దేశాల ప్రకారం వ్యాక్సినేషన్లు పూర్తి చేయాలి

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా,సాంబశివరావు





**వరంగల్, అక్షిత బ్యూరో:** ప్రభుత్వం నిర్దేశాలకు అనుగుణంగా వ్యాక్సినేషన్లు వైద్య సేవలు ప్రజలకు అందాలని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా, సాంబశివరావు అన్నారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నర్సంపేట లో సూపరింటెండెంట్ డాక్టర్ కిషన్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ్ వ్యాక్సినేషన్ ని ప్రారంభించారు.

ప్రారంభానికి విచ్చేసిన ప్రజల నుద్దేశించి మాట్లాడుతూ హెచ్ పి వి 14 సంవత్సరాల పైబడిన వారు 15 సంవత్సరాల లోబడిన వారికి ఇస్తామని దీని వలన గర్భస్థ ముఖ ద్వార క్యాన్సర్ రాకుండా ఈ వ్యాక్సిన్ పని చేస్తుందని తెలిపినారు. ప్రతి అర్హత కలిగిన కౌమార దశలో ఉన్న ఆడపిల్లలు తప్పని సరిగా ఈ వ్యాక్సినేషన్ తీసుకోవడం వలన ఆరోగ్యవంతంగా జీవించవచ్చునని తెలిపినారు. స్త్రీలు మానవ జాతి మనుగడ అభివృద్ధిలో గణనీయమైన పాత్ర పోషిస్తున్నారని వారిని గౌరవించడం సమాజాన్ని గౌరవించినట్లేనని కొనియాడినారు. ఈ సందర్భంగా వారికి ప్రశంస పత్రాలు అందించి సేవలు కొనియాడారు. జిల్లా డిప్యూటీ ఇమినైజేషన్ , హెచ్పివి వ్యాక్సిన్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ ప్రకాష్ ఆదివారం 20 మంది పిల్లలు వ్యాక్సినేషన్ తీసుకోన్నారని తెలిపినారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ప్రకాష్ వైద్యాధికారులు డిప్యూటీ డెమో అనిల్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు

# అయిజ మున్సిపాలిటీలో వాలీబాల్ ప్రాంగణం ప్రారంభం

### అయిజ మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్



**గద్వాల ,అక్షిత న్యూస్,** అయిజ మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ పాగుంట సువర్ణ ఆధ్వర్యంలో బీరప్ప దేవస్థాన ప్రాంగణంలో 12వ వార్డు యువకులు ఏర్పాటు చేసిన వాలీబాల్ క్రీడా ప్రాంగణాన్ని మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్ , బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మల్లికార్జున్ రెడ్డి తో కలిసి ఆదివారం ప్రారంభించారు. యువతకు చైర్మన్ సూచనలు క్రీడల ద్వారా ఊరుకు, తల్లిదండ్రులకు పేరు తెచ్చుకోవాలని సీఎం సురేష్ పిలుపునిచ్చారు. "వాలీబాల్ శరీర బలం, గుండె ఆరోగ్యం, ఏకాగ్రత, మానసిక ఒత్తిడి నివారణకు ఉపయోగపడుతుంది. గెలుపు, మంచి ప్రదర్శనతో విశ్వాసం పెరుగుతుంది. యువత క్రీడారంగంలో ముందుకు రావాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, 12వ వార్డు ప్రజలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు,

# షాద్‌నగర్ డీసీపీ కార్యాలయంలో డిజిటల్ ఎఫ్ఐఆర్ నమోదుపై శిక్షణ కార్యక్రమం



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి** ఫ్యూచర్ సీటీ కమిషనరేట్ పరిధిలోని షాద్‌నగర్ డీసీపీ కార్యాలయంలో పోలీసు అధికారులకు కేసుల దర్యాప్తుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీసీపీ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో కీలక అంశాలపై చర్చించారు. గొడవలు లేదా దాడులు జరిగినప్పుడు కేసులను ఎలా నమోదు చేయాలి, సాక్ష్యాలను ఎలా సేకరించాలి అనే అంశాలపై నందిగామ ఎస్ఐ యాదయ్య, ఏఎస్ఐ శ్రీనివాస్ వివరించారు. ఐటీ విభాగానికి చెందిన పీసీ బాలరాజు ఒక వినూత్న విధానాన్ని పరిచయం చేశారు. ఇకపై ఘటన జరిగిన చోటు నుండే డిజిటల్ పద్ధతిలో ఎఫ్ఐఆర్ నమోదు చేసే విధానంపై అధికారులకు అవగాహన కల్పించారు.

డిజిటల్ సాక్ష్యాల సేకరణ వల్ల కేసుల విచారణ వేగవంతం అవుతుందని, బాధితులకు త్వరగా న్యాయం జరుగుతుందని అధికారులు తెలిపారు. షాద్నగర్ డివిజన్ పరిధిలోని పోలీసులు కేసులను పరిష్కరించేందుకు త్వరితగతిన ముందుకు సాగాలని డీసీపీ శిరీష పిలుపునిచ్చారు షాద్‌నగర్ జోన్ పరిధిలోని ఎస్‌హెచ్ఓలు, ఎస్ఐలు మరియు స్టేషన్ రైటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సూర్యాపేటలో సందడి చేసిన క్రేజీ హీరోయిన్

## వివాహ షాపింగ్ మాల్ ని ప్రారంభించిన నిధి అగర్వాల్



**సూర్యాపేట , అక్షిత ప్రతినిధి :** సూర్యాపేట పట్టణం నేడు నగరాలకు దీటుగా అభివృద్ధి చెందుతూ వ్యాపార రంగంలో రాణిస్తుందని క్రేజీ హీరోయిన్ నిధి అగర్వాల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నూతనంగా ఏర్పాటు చేసిన వివాహ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మీడియాతో మాట్లాడారు.ఏ సంస్థ అయినా వ్యాపార రంగంలో రాణించాలంటే ప్రజల మన్ననలు పొందాలన్నారు.అటువశీటప్పుడే ఆ సంస్థ పేరు ప్రఖ్యాతలు గడుస్తోందని చెప్పారు.అటు ఆంధ్ర ప్రదేశ్ కి ఇటు తెలంగాణ ప్రదేశ్ కి సూర్యాపేట జిల్లా కేంద్రం సరిహద్దుగా ఉండడంతో నగరాలు ధీటుగా ఉందన్నారు.ఈ సందర్భంగా అగర్వాల్ సూర్యాపేటకు వస్తుందని తెలుసుకున్న జనం ఆమెను చూడడానికి పెద్ద సంఖ్యలో చేరుకొని ఆమెతో కరచాలనం చేసేందుకు,సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు.ఇందుకు ఆమె అభిమానులతో కలిసి సెల్ఫీలు తీసుకున్నారు.అభిమానుల కోరిక మేరకు ఆమె కాసేపు డ్యాన్స్ తో సందడి చేశారు.అనంతరం మాల్ నిర్వాహకులు శింగిరి కొండ రవీందర్ మాట్లాడుతూ వివాహాది శుభకార్యాలకు వధూవరులు కావలసిన వెరైటీ వస్త్రాలను సరసమైన ధరలకు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో శింగిరి కొండ సుకుమార్,శింగిరి కొండ ప్రదీప్,శింగిరి కొండ వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్ డాక్టర్ సత్య శారదా



**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని జిల్లా వేర్ హౌజ్ గోదాములలో భద్రపర్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల ( ఈవీఎంల)ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి ఆదివారం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని జిల్లాకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపర్చిన ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు.ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో కలెక్టరేట్ ఏవో విశ్వ ప్రసాద్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ రంజిత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు టిడిపి నుండి శ్యామ్, ఏ ఐ ఎం ఐ ఎం నుండి ఫైజొద్దీన్, బిజెపి నుండి హరిశంకర్, వైఎస్సార్ సిపి నుండి రజనీకాంత్, బి ఎస్ పి నుండి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత్‌నగర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**మియాపూర్ అక్షిత ప్రతినిధి..** అంతర్జాతీయ మహిళా దినోత్సవం--2026 సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ లలో ఘనంగా వేడుకలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు , ప్రసాద్స్ ఫౌండేషన్ స్థాపకుడు చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మియాపూర్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ , దోనేపూడి రమాదేవి, ప్రసాద్స్ ఫౌండేషన్ డైరెక్టర్ అండ్ ప్రోగ్రామ్ చీఫ్ కోఆర్డినేటర్ లీలా ప్రసాద్ హాజరయ్యారు, ఈ సందర్భంగా మన మియాపూర్ డివిజన్ లో ప్రతీ రోజు ప్రతి సందు, ప్రతి రోడ్ ఉదయం నుంచి సాయంకాలం వరకు, ఎండ ఆనక, వాన ఆనక మన ప్రాంతాన్ని శుభ్ర పరుస్తున్న జి హెచ్ ఎమ్ సి పారిశుధ్య మహిళా కార్మికులు అందరిని,సుమారు 40 మందికి బహుమతులు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన ఉప్పలపాటి శ్రీకాంత్ , సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దోనేపూడి రమాదేవి మాట్లాడుతూ పారిశుధ్య మహిళా కార్మికులు ఎండ అనక వాన అనక మనకోసం మన పరిసరాల



పరిశుభ్రత కోసం వాళ్ళు పడే శ్రమను గుర్తించడం వారిని గౌరవించడం మా ప్రసాద్స్ ఫౌండేషన్ పూర్వ జన్మ సుకృతం అన్నారు, ఈ సందర్భం గా ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మెన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ మాట్లాడుతూ పారిశుధ్య మహిళా సిబ్బంది సమాజానికి సేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తు న్నారని అభినందిస్తూ, వారు పడే శ్రమ మనకి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది అని ఆకాంక్షించారు. మహిళల అభ్యున్నతికి తాను ఎల్లప్పుడూ అండగా నిలుస్తానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ కాలనీ ప్రతినిధులు మరియు ప్రసాద్స్ ఫౌండేషన్ సభ్యులు అలాగే శ్రీమతి దోనేపూడి మంజుల ,శ్రీమతి వల్లభనేని రాజ రాజేశ్వరి, టీమ్ సభ్యులు ఏమ్ ఆర్ కె చౌదరి ,ప్రసాద్స్ ఫౌండేషన్ టీమ్ సభ్యులు భాష, రవి, సురేందర్, రాంబాబు,




మూర్తి, శేఖర్ నాయుడు, వెంకట్రావు, ఎం ఆర్ కె చౌదరి, దోప్పలపూడి వినోద్ చౌదరి ,శ్రీను, శ్రీకాంత్, పెద్దబాబు, సుదులగుంట్ల ప్రసాద్, రాజేష్, తులసి, పవన్, బాలు, చిన్న, బొజ్జ రవికుమార్, సతీష్, సింహాచలం, కమలాకర్ రెడ్డి, పవన్ రెడ్డి, నరేష్ (నాని), పవన్, అభిజిత్, రాము, చక్రపాణి, కిలారి ప్రసాద్, వరుణ్, పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమం మహిళా సాధికారత, ఐక్యత మరియు సమాజంలో మహిళల పాత్రను మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో విజయవంతంగా ముగిసింది. అలాగే రానున్న రోజుల్లో మహిళా సాధికారతకు పెద్దపీట వేయడం కోసం మా శక్తి కొలది పని చేస్తామని తెలిపారు

# పరీక్షల ఒత్తిడితో పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య



**మందమర్రి, అక్షిత ప్రతినిధి :** మందమర్రి పట్టణంలోని సీఎస్పీ రోడ్డుకు చెందిన పదో తరగతి విద్యార్థి పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం క్యాతన సత్యనారాయణ కుమారుడు క్యాతన్ తనై (16) సింగరేణి హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో అతడు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై, మంచి మార్కులు రాకపోవచ్చనే ఆందోళనతో గత కొద్ది రోజులుగా తల్లిదండ్రుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది.ఆదివారం తెల్లవారుజామున తండ్రి చదువుకోమని నిద్రలేపి వెళ్లగా, అనంతరం ఇంటి ముందున్న షెడ్డు ఇనుప పైపుకు నైలాన్ తాడుతో ఉరివేసుకుని తనై ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. హుటాహుటిన కిందకు దించినప్పటికీ అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు.సంఘటన స్థలంలో సారీ మమ్మీ, ఐ లవ్ యు డాడీ, సారీ శ్రీనిధి అని రాసిన సూసైడ్ నోట్ లభ్యమైంది. మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రామ ప్రభు అద్వర్యంలో అరబిందో కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు..



**మియాపూర్ అక్షిత ప్రతినిధి..** అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలోఅరబిందో కాలనీలో మహిళా దినోత్సవ వేడుకలు శనివారం రోజు మియాపూర్ 240 డివిజన్, అరబిందో కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రముఖ సామాజిక సేవకుడు అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు మరియు పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళల కోసం వినోదాత్మక ఆటలు నిర్వహించారు. అందులో లెమన్ అండ్ స్పూన్, బ్యాలన్స్ బెలూన్, ఫిల్ ద వాటర్ బాటిల్, తగ్ ఆఫ్ వార్ వంటి ఆటలు నిర్వహించి మహిళలను ఆనందపరిచారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులు ప్రకటించారు. అలాగే పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.5,000 విలువైన గిఫ్ట్, రెండవ బహుమతిగా రూ.3,000 విలువైన గిఫ్ట్ ప్రకటించడం విశేషం.ఈ సందర్భంగా అట్టేపల్లి రామప్రభు మాట్లాడుతూ మహిళలు సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారికి గౌరవం మరియు ప్రోత్సాహం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సుమారు 200 కి పైగా సభ్యులు కాలనీ మహిళలు, పిల్లలు, నివాసితులు ఏ.ఆర్.పి. టీం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.